మద్యం దుకాణం తిరిగి ఏర్పాటు చేయొద్దు

అంబర్‌పేట: మద్యం దుకాణంతో గత రెండెళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ దఫా ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ యవద్దంటూ చేశారు. మంగళవారం రాత్రి అలీకేఫ్ నుంచి ప్రేమ్‌నగర్ వైపు వెళ్తుండగా ఉన్న వైన్స్ ముందు స్థానికులు నిరసన తెలిపారు. మద్యం దుకాణంలో కోసం ప్రభుత్వం చేపడుతున్న కేటాయింపుల్లో ఇక్కడి మాత్రం మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి మద్యం దుకాణం వద్దని ఇప్పటికే ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశామని తెలిపారు. స్థానికులను ఇబ్బందులకు గురిచేసే వైన్స్ షాపు ఏర్పాటు చేస్తే ఆందోళనను తీవ్రం చేస్తామన్నారు.

కుద్బిగూడలో రోడ్లకు ప్యాచ్‌వర్క్



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాచిగూడ డివిజన్‌లో పలు రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించి మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు ఆర్థికసాయం

కాచిగూడ: తండ్రిని లేదా సంరక్షకుడిని కోల్పోయిన విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్, కాలేజీ ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం, రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.అంజనారెడ్డి తెలిపారు. అర్హత గల విద్యార్థులు నవంబర్ 14వ తేదీలోగా దరఖాస్తులను కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో అందజేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

◆ ప్రతిభా పురస్కారాల కోసం మున్నూరుకాపు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. 80శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం: 040–24658160, 24657404లో సంప్రదించాలని కోరారు.

సిద్ధార్థకు టెన్నిస్ టైటిల్



బాలుర సింగిల్స్ టైటిల్ గెల్చుకున్న సిద్ధార్థకు స్వర్ణపతకం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మయ్య

కాచిగూడ: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ అండర్–19 బాలుర టెన్నిస్ టోర్నమెంట్ టైటిల్‌ను కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ క్రీడాకారుడు జె.సిద్ధార్థ కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం జరిగిన అండర్–19 జూనియర్ బాలుర విభాగం సింగిల్స్‌లో జె.సిద్ధార్థరెడ్డి 6 – 3 స్కోర్‌తో సి.మోక్ష రెడ్డి (భవన్స్ జూనియర్ కాలేజ్)పై విజయం సాధించాడు. తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.జక్కయ్య, అన్నామేరీ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ తయారీ యూనిట్లలో తనిఖీలు చేపట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దగ్గు సిరప్ ఘటనపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఐ దక్షిణ భారత ఉపాధ్యక్షురాలు డా. దివ్య చందన అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆమె విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల దగ్గు సిరప్ సేవించడంతో పిల్లలు మరణించిన సంఘటనపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఔషధ తయారీ, పర్యవేక్షణ వ్యవస్థల్లో ఉన్న లోపాలు స్పష్టమవుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదకరమైన రసాయనాల వినియోగంపై ప్రమాణాలను నిర్ధారించాలన్నారు. వాటి వాడకంపై నియంత్రణలను అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న ఔషధ తయారీ యూనిట్లను పర్యవేక్షించేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. మార్కెట్‌లో లభించే ప్రతి ఔషధం సురక్షితంగా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా వైద్యులు సూచించిన సిరప్‌ను వాడాలన్నారు.

వ్యర్థాలను తొలగించండి.!

- న్యూ నల్లకుంటలో వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- మదర్ డెయిరీ పార్క్ వెనుక భాగం దుర్గంధం
- ఇళ్లలోని వ్యర్థాలను నిర్లక్ష్యంగా వీధుల్లోనే పారవేస్తున్న జనం



న్యూనల్లకుంట మదర్ డెయిరీ పార్క్ వెనుక పేరుకుపోయిన చెత్తకుప్పలు

నల్లకుంట: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్‌ల పర్యవేక్షణ లోపం కారణంగా నల్లకుంట డివిజన్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధులను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది (కార్మికులు) చెత్తను తీసుకు వచ్చి అంతర్గత వీధుల్లో ఎక్కడపడితే అక్కడే కుప్పలుగా పోగేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ గుర్తించిన ఓపెన్ పాయింట్ల వద్ద వీధులు శుభ్రం చేసిన చెత్తను వేయాలి.

◆ కానీ పారిశుద్ధ్య కార్మికులు మాత్రం ఎక్కడపడితే అక్కడ చెత్తను కుప్పలుగా పోసి చేతులు దులుపుకుంటారని సర్వత్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇళ్లల్లో పేరుకుపోతున్న చెత్త వ్యర్థాలను ఇంటింటి వచ్చే స్వచ్ఛ ఆటోల్లో వేయాల్సిన కొందరు వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చి నిర్లక్ష్యంగా వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు.

◆ ఈ చెత్తను ఏ రోజు కారోజు తరలించాల్సిన రాంకీ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాల కారణంగా దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. అలాగే వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

◆ న్యూ నల్లకుంట మదర్ డెయిరీ పార్క్ పరిసరాల్లో వీధులు శుభ్రం చేస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులు చెత్తను పార్క్ వెనుక కుప్పలుగా పోస్తున్నారు. దీనికి తోడు యా ప్రాంతాల్లోని ఇళ్లల్లో పని వాళ్లు ఇళ్లల్లోని వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చి పార్కు వద్ద పేరుకుపోతున్న చెత్త కుప్ప వద్ద పడవేసి వెళ్తున్నారు.

◆ ఈ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాల్సిన రాంకీ సంస్థ సిబ్బంది తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. పార్క్ ప్రహరీ చుట్టూ చెత్త పేరుకుపోతుండడంతో దుర్వాసన వెలువడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని పార్కుకు వచ్చే వృద్ధులు, మహిళలు అంటున్నారు.



మదర్ డెయిరీ పార్క్ వెనక వీధిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

◆ అలాగే పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వీధులు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడి చెత్తను అక్కడే కుప్పలుగా పోసి వదిలేస్తున్నారు. దీనికి తోడు ఇళ్లల్లో పనిచేసే సర్వెంట్లు ఆయా ఇళ్లల్లోని వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చి వీధుల పక్కన పేరుకుపోతున్న చెత్త కుప్పలై పడేసి వెళ్తున్నారు. దీంతో నిత్యం వీధులు శుభ్రం చేసినా పారిశుద్ధ్య సమస్యలు యథావిధిగా ఉంటున్నాయి. వీధుల్లో పేరుకుపోయే చెత్తను తరలించే పనులు కంగ్రాక్ట్ తీసుకున్న రాంకీ సంస్థ సిబ్బందిపై పర్యవేక్షణ లేని కారణంగా వీధుల్లో చెత్త ఏ రోజుకారోజు తరలించడం లేదని దీంతో వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

◆ ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి, వీధుల్లో పేరుకుపోతున్న చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగింపజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రజలు తమ ఇళ్లల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను వీధుల్లో వేయకుండా కాలనీలు, బస్తీలలో ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే వేస్తే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తవని పలువురు అంటున్నారు.

హమ్మయ్య.. ఎట్టకేలకు స్పందించారు

రైల్వే ట్రాక్ లేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ రైల్వే ట్రాక్ లేన్ గుంతలమయంగా మారింది. దీంతో ఈ వీధి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య గత కొన్నేళ్లుగా ఉన్నా ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యపై 'సాక్షి'దినపత్రికలో గతంలో ఓ కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన స్థానిక శాసనసభ్యుడు తన ఎమ్మెల్యే నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి గతేడాది శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ కొన్ని కారణాలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. ఛిద్రమై రోడ్లపై గత నెల 3వ తేదీన సాక్షిలో 'రోడ్లు అస్తవ్యస్తం'శీర్షికతో మరోమారు కథనం ప్రచురితమైంది. దీంతో ఎట్టకేలకు స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్ మంగళవారం జేసీబీతో తవ్వి వ్యర్థాలను తొలగించి రోడ్డును చదును చేసే పనులను ప్రారంభించారు.



రైల్వే ట్రాక్‌లేన్‌లో సీసీరోడ్డు నిర్మించేందుకు ఛిద్రమైన రోడ్డును చదును చేస్తున్న దృశ్యం



సాక్షిలో గత నెలలో ప్రచురితమైన కథనం

వీహెచ్‌కు పరామర్శ



అంబర్‌పేట: అస్వస్థతకు గురైన మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావును రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పరామర్శించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీహెచ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

న్యాయ విద్యార్థులు సమధర్మం పాటించాలి



లా ఫెస్ట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: న్యాయ విద్యార్థులు అన్ని విషయాల్లో సమధర్మాన్ని పాటిస్తూ న్యాయం వైపు నిలబడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, అంబేడ్కర్ విద్యాసంస్థల చైర్మన్ వివేక్ వెంకటస్వామి అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో 4 రోజులపాటు జరిగే లా ఫెస్ట్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దివంగత కేంద్రమంత్రి జి.వెంకటస్వామి(కాకా) ఆశయ సాధనలో నడిపిస్తున్న ఈ కళాశాలలో ఎంతోమంది చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకున్నారని అన్నారు. పలువురు విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు వచ్చాయని పేర్కొన్నారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అలవర్చుకొని, దాన్ని పది మందికి పంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, సీఈఓ లింబాద్రి, డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.... గుర్తుతెలియని మహిళ (55) ఫలక్‌నుమా – శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగొద్దన్నందుకు యువకుడు ఆత్మహత్య



సంజయ్ (ఫైల్)

అంబర్‌పేట: అతిగా మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేట రామకృష్ణనగర్‌లో నివసించే సుధాకర్ (లేట్) కుమారుడు సంజయ్ (29) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి అతిగా తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతడిని మందలించారు. తీవ్ర మనస్థాపానికి గురైన అతడు గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సమయం తర్వాత నిద్రపోయాడా లేదా అని కుటుంబీకులు గమనించిగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం ఉద్యోగాలను అమ్ముకుంది

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



గ్రంథాలయం గేటు ఎదుట నిరుద్యోగులతో బైఠాయించిన కల్వకుంట్ల కవిత

చిక్కడపల్లి: చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్–1 అభ్యర్థులను పరామర్శించేందుకు మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వచ్చారు. ఈ క్రమంలో ఆమెను లోపలికి వెళ్లకుండా చిక్కడపల్లి పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, జాగృతి కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం గ్రంథాలయంలోకి చేరుకున్న ఆమె నిరుద్యోగులతో కలసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... గ్రూప్–1 ర్యాంకర్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ఎలా ఉంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉద్యోగాలను అమ్ముకుందని ఆరోపించారు. విద్యార్థులతో మాట్లాడటానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. హైకోర్టులో అనుకూలంగా తీర్పురాకపోతే అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని విద్యార్థులు అంటున్నారని అన్నారు. ఖచ్చితంగ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. అనంతరం ఆమె నిరుద్యోగులతో కలసి టీ తాగారు.

18న ఇంద్రసేనారెడ్డి ప్రథమ వర్ధంతి

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్. ఇంద్రసేనారెడ్డి ప్రథమ వర్ధంతిని ఈనెల 18న నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్‌రెడ్డి, డాక్టర్ బి. దివాకర్‌రెడ్డి, డాక్టర్ ఎస్. వెంకటప్రసాద్‌రెడ్డి నేడొక ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఆవరణలోని గాంధీ సెంటనరీ హాల్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు వర్ధంతి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు. దీనికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ వి. హనుమంతారావు, కె. కేశవరావు, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతర పార్టీల ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

వెంకటేష్ ముదిరాజ్‌కు మహాత్మాగాంధీ శాంతి అవార్డు



మహాత్మాగాంధీ శాంతి అవార్డు అందుకుంటున్న వెంకటేష్‌ముదిరాజ్

కాచిగూడ: సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న బీజేపీ సీనియర్ నేత వెంకటేష్ ముదిరాజ్ మహాత్మా గాంధీ శాంతి అవార్డును అందుకున్నారు. సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బోగ్గులకుంటలో జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి గాను వెంకటేష్‌కు అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

'బౌద్ధ ధర్మంతోనే తాత్విక విముక్తి లభిస్తుంది'

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్



కవాడిగూడ: దళిత బహుజన సమాజానికి బౌద్ధ ధర్మంతోనే తాత్విక విముక్తి లభిస్తుందని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో 'బౌద్ధ ధర్మ దీక్ష దివస్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లక్షలాది మంది అనుచరులతో బ్రాహ్మణ అధిపతి హిందూ మతాన్ని వదిలేశారన్నారు. 1956 అక్టోబర్ 14న బౌద్ధ ధర్మాన్ని నాగపూర్ దీక్ష మైదానంలో స్వీకరించారని గుర్తు చేశారు. కుల, వర్ణ వ్యవస్థ లేని బౌద్ధ మతంతోనే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధ్యమని అంబేద్కర్ గ్రహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఏస్ రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి శంకు శ్రీనివాసులు, డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గణేష్, నాయకులు నరిసింహాచారి, హైకోర్టు మద్దెల రాయప్ప, చందు, సూర్యకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సినీనటి అన్నపూర్ణకు అభినందన అక్కినేని పురస్కారం



చిక్కడపల్లి: అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో మంగళవారం అభినందన అక్కినేని పురస్కార ప్రదానోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సినినటీ అన్నపూర్ణకు పురస్కారాన్ని ఆధ్యాత్మిక గాయని శోభారాజు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమ్మ, వదిన, బామ్మ పాత్రలను అన్నపూర్ణ పోషిస్తూ రాణిస్తున్నారని అన్నారు. ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు సంజయ్‌కిషోర్, కృష్ణకుమారి, భవాని, రాధిక, శ్రీనివాస్, శశివదన, లక్ష్మణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాను స్తంభింపజేస్తాం

8న బంద్‌ను విజయవంతం చేయండి: వేముల రామకృష్ణ



కాచిగూడ: బీసీల అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న అగ్రవర్ణాల కుట్రలను తిప్పి కొట్టేందుకు బీసీలందరూ సంఘటిత ఉద్యమాలు చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నం.9 ద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అగ్రవర్ణాలకు చెందిన కొందరు హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారని అన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేకు వ్యతిరేకంగా ఈనెల 18న చేపట్టనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో 56శాతం ఉన్న బీసీలు రోడ్లపైకి వచ్చి ప్రజా రవాణాను పూర్తిగా స్తంభింపజేస్తారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అగ్ర కులాలను ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. అగ్రకులాలకు చెందిన ఒక్క ప్రజా ప్రతినిధి కూడా గెలవకుండా చేస్తామన్నారు. ఆ విధంగా బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థులు రాజేష్, శ్రీనివాస్, మహిపాల్, వంశి, సునీల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయమే ఫైనల్.!

కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి

- కష్టపడి పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం
- సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నియామక సమావేశం
- ముషీరాబాద్ నియోజకవర్గ కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా అధ్యక్షుడి ఎన్నుకుంటామని సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడి నియామక పరిశీలకుడు, కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి సూచించారు. కష్టపడి పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పార్టీని బలోపేతం చేసే వారికే పదవిలో నియమిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో సంఘటన్ సృజన్ అభియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ అండ్ బీ బ్లాక్ కమిటీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కష్టపడి పనిచేసే వారికే ఉన్నత పదవులు..

◆ ఈ సందర్భంగా సీపీ జోషి మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌స్థాయి నుంచి కష్టపడి పనిచేసే వారే భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహిస్తారని పేర్కొన్నారు. యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలను పార్టీకి చేరవయ్యేలా పార్టీ నాయకులు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టాలంటే కిందిస్థాయి నాయకులు క్రమశిక్షణతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం పార్టీ నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యకర్తలు తమ విన్నపాలను వినతిపత్రం రూపంలో సమర్పించారు.

◆ ఈ సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, సమావేశం కోఆర్డినేటర్ పవన్, ఏ అండ్ బీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు వీడీ కృష్ణ, అంజియాదవ్, యూత్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సంఘపాక వెంకట్, మాజీ కార్పొరేటర్లు వాజీద్‌హుస్సేన్, కల్పన యాదవ్, డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, నాయకులు లింగంగుప్తా, జి.గోవింద్, సయ్యద్ మోహిన్, మేడి సురేష్‌కుమార్, లోకేష్‌యాదవ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, మహిళా కమిటీ అధ్యక్షురాలు కవిత, డాక్టర్ మినాజ్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి నరేందర్ దరఖాస్తు...

◆ ముషీరాబాద్ నియోజకవర్గం ఏ అండ్ బీ బ్లాక్ కమిటీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి ఏఐసీసీ నాయకుడు సీపీ జోషిని కలిసి పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని మూడు జిల్లాలో ఏదైనా ఒక జిల్లాను దళిత సామాజికవర్గానికి చెందిన నాయకుడికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. తాను నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విధులు నిర్వహించడంతో పాటు పలు పదవుల్లో పని చేసి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానన్నారు.

పనిచేసే వారికే పదవి ఇవ్వాలి: తేజగౌడ్

◆ క్రమ శిక్షణతో పనిచేసే వారికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నాయకులు తేజాగౌడ్ సీపీ జోషిని కలిసి వినతిపత్రం అందజేశారు. గోల్కొండ హోటల్‌లో ఆయనను కలిసి అధ్యక్ష పదవి విషయంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగిన వారికి రెండోసారి ఇవ్వొద్దని కోరారు.